# రమణ

# హాస్యకథలు

ఎమెస్కో

# మనజన రణగొణ

నోటుకి నాటుకి నోటికి మాటలు బీటలు ఓటర్లు
మంత్ర తంత్ర కుతంత్రాల తంత్రులు మంత్రులు
అదిపోయే యిదిపోయే అని వాపోయే పీయేలు
ధిక్కారాల షికారుల కారులు అధికారులు
ఆపాదమస్తకం నమస్తేల సమస్త పుస్తకాలు గుమాస్తాలు
కొన్నైనా కాని పన్లు అన్నుల మిన్నల కన్నులు యూనియన్లు
ముసుగుల లొసుగుల గొలుసుల సొగసుల పోలీసులు
వాదనల వేదనల నాదాల నినాదాల న్యాయవాదులు
బాధల గాథల సేద్యాల ట్రాక్టర్లు డాక్టర్లు
గుంజిన గుంజును యింజను లేని వీరులు యింజనీర్లు
అర్థం వ్యర్థం సమర్థనలేని అనర్థాలు విద్యార్థులు
ఉద్యమ విద్యల మధ్య సయోధ్యలేని ఉపాధ్యాయులు
పునాది సరిగా లేదని అనాదిగా పెను మనాది
మానస కొసల పనస సొనలు మన సినిమాలు
చిత్రవిచిత్ర వివస్త్ర ప్రసస్తాలు చిత్రసీమ పురుష స్త్రీలు
కష్టపడలేని ముష్టివాళ్ళ యిష్టాగోష్ఠులు
కాటికి సూటిగా పంపే బాటలు ఆటో మోటర్లు
నష్ట నిష్ఠూరాల నిష్ఠాగరిష్ఠులు జర్నలిస్టులు
రాజీ – కయ్యాల రాజకీయాల రూపులు మార్చే లేసర్లు పేపర్లు
పవిత్ర భావపుత్రికలో కావో సచిత్రవారపత్రికలు
తర్జన భర్జనచేసి ‘మార్జిన్’లో ఆర్జించిన ఆస్తులు వ్యాపారస్తులు
ఊగి తూగినా ఆగని జేబులు జారే బజారులో బారులు
కాలుస్తాం, చీలుస్తాం తుపాకి మోతలు మోగిస్తాం అడగొద్దు ఏది సాధిస్తాం
కలలు గనే కలాలు, తుంచిన కుంచెల అంచులు, కాసుకు కదిలే ‘కళ’లు
ధృతరాష్ట్ర దృష్టితో రాష్ట్ర పురోగతికి ఏ గోతి గతి?
**అది మరిచిపోయి ఆదమరచిపోయి హాయిగా నవ్వుకుందాం.... పేజీ తిప్పండి.**



నవ్వేజనా: హాస్యోభవంతు!




# ఆనందలహరి

**ఓ** గుడ్డముక్క వేసి ఆ సీటు నాదే అనడం ముందు కనిపెట్టిన వాడెవడో గాని యిటువంటి విషయాలు క్షణంలో తెలుగుజాతి గుణాలై కూర్చుంటాయి. "మేడమ్ కాస్త దస్తీ చూడండి ప్లీజ్" పరిచయం చేసుకోవాలనే ఆ అమ్మాయికా పనిపెట్టాడు ఆనంద్. ఆ అమ్మాయి చాలా సీరియస్‌గా చూసింది. ఆ చూపులో కనురెప్ప అణువంత కదిలింది. అది చాలు అనుకున్నాడు. తోసుకుని వచ్చి ఆ అమ్మాయి ఎదురు సీట్లో కూర్చున్నాడు. ఓ లావాటి పుస్తకం చదువుతున్నది దీక్షగా. ముందుగా ఆ అమ్మాయి ఎక్కడికో తెలుసు కోవాలి. అడిగితే అరిచేట్లుంది వాలకం చూస్తే సికింద్రాబాద్ వచ్చే ట్లుంది!

తనూ ఓ పుస్తకం చదవాలి. చదువు తున్నట్లు నటించాలి. తన దగ్గర గంటల పంచాంగం ఒక్కటే వుంది. అమ్మ పెట్టింది యింటర్వ్యూకి వెళ్లే ముందు వర్జ్యం చూసు కోవడానికి. అటూ ఇటూ చూసి ఆ అమ్మాయి వైపు నిలిచాయి కళ్లు.



అమ్మాయి కూడా అదే పని చేసింది. పదిహేను నిమిషాల్లో నవ్వులు పంచుకోడాలు అయిపోయాయి.

ఎంత జాగ్రత్త పడ్డా ఓ పెద్దాయన తనని గమనిస్తూనే వున్నాడు. ఆయనకు ఇంపార్టెన్సు ఇవ్వాల్సిన పనిలేదు. అయినా ఆ ముసలోడు యిక్కడే ఎందుకు వేలాడుతున్నాడు. ఏం చేస్తాం త్యాగరాయ కీర్తన అనుకున్నాడు ఆనంద్.

• • •

ఇద్దరికీ ఒకేచోట ఇంటర్వ్యూ!

యిద్దరికీ హైదరాబాద్‌లో చుట్టాలున్నారు.

“యిప్పుడు నువ్వైనా నేనైనా ఒకళ్ళ యింటికి వెళ్ళి ఇబ్బంది పెట్టి వుండాల్సిన వాళ్ళమే కదా” అన్నాడు ఆనంద్.

“నిజమే. కానీ నావల్ల వాళ్లకి అంతగా ఇబ్బంది వుండదు” అంది లహరి.

“ఏదో చెప్పాలని తటపటాయిస్తున్నాడు ఆనంద్.

రైల్లో తనని చికాకు పెట్టిన పెద్దాయిన యిటే వస్తున్నాడు. “ఇంటర్వ్యూ దగ్గర కలుద్దాం ఆల్ ది బెస్ట్” అని ఆటో ఎక్కింది లహరి.

ఏదో దిగులుతో బస్సెక్కాడు ఆనంద్.

• • •

ఉద్యోగానికి వచ్చిన అభ్యర్థులు అందరూ హుందాగా వున్నారు. ఒకతను వచ్చి అందరిపేర్లు చిరునామాలు రాసుకున్నాడు. యింకొకతను వచ్చి లోపల ఎలా వుండాలి ఎక్కడ కూర్చోవాలో చెప్పాడు. అరగంట ఆలశ్యంగా ఆఫీసరు వచ్చాడు. బూట్ల శబ్దం లోపలికెళ్లింది. ఆనంద్ గుండెల్లో రాయిపడింది. ఆ ఆఫీసరు రైల్లో కురకుర చూపులు కలిపిన పెద్దాయనే!

• • •

మీ యిద్దరికీ అభినందనలు. మీ అర్హతలు మీ నడవడి మీకు ఉద్యోగాలు తెచ్చిపెట్టాయి. జాగ్రత్తగా చేసుకోండి” చెప్పాడు ఆఫీసర్. రైల్లో ఆయన ప్రవర్తనకు పూర్తిగా భిన్నంగా వున్నాడు. పేరు వృకోదరం. ఆఫీసులో నలుగురు ఆడవాళ్ళు, అటెండర్లతో కలుపుకుని ఎనిమిది మంది మగవాళ్ళు ఉన్నారు. గజగజ వణుకు నటిస్తున్నారు. ఉద్యోగ జీవితం అనుకున్నంత తేలిక కాదని ఎంతోకాలం పట్టలేదు ఆనంద్ తెలుసుకోడానికి. ఆఫీసులో ఒకళ్ళమీద ఒకళ్లు గూఢచారుల్లా వున్నారు. ఒకళ్ళకూ ఆఫీసు పని అంతగా వచ్చినట్లు లేదు. వాళ్లలో విభేదాలు